# లాంఛనం

ఆరోజు టపాలో పెళ్లి శుభలేక వచ్చింది. ఇంటి ఇల్లాలు ఆసాంతం చదివి, ఆశ్చర్యంగా భర్త వంక చూస్తూ "ఈ విడ్డూరం చూసారా?" అంది. రామచంద్రయ్య గారు ఎవరిదో జాతకం పరీక్షచేస్తూ జానకమ్మగారి వంక చూస్తూ "ఏంతా? విడ్డూరమా?" అని అడిగారు. ఆవిడ కోపంగా "వినాశకాలం" అన్నది.

ఆయన చిరునవ్వు నవ్వి "తన కోపమే తన శత్రువు- శాంతించండీ" అని అన్నారు. కాని ఆవిడ శాంతించలేదు. కంఠంలో ఆవేశం వుంది, ఆవేదన వుంది.

"ఇటువంటి వాళ్ళ వల్లనే శాస్త్రం అపహాస్యం పాలయ్యింది. ఎటువంటి అప్రాచ్యులు తయారయ్యారు" అని ఆందోళన పడ్డది. ఆయన చాలా సౌమ్యంగా "కలౌ వర్ణ సంకరః కలౌ శాస్త్ర సంకరః" అని అన్నారు.

"చూస్తూ ఊరుకుంటే కాదు, ఇటువంటి పనులు ఎందుకు చేస్తున్నావ్ అని నిలదీయండి. ఇటువంటి బుద్ధి తక్కువ పనులు ఇకముందు చెయ్యవద్దని హెచ్చరించండి. జరిగిన దానికి ప్రాయశ్చిత్తం చేసుకుని అఘోరించమనండి."

"అలాగే కానీ అతగాడెవరో మనకు తెలియదుగదా!"

"కన్యాదాతకు రాసి తెలుసుకోండి. ఇది కలియుగం. అన్యాయాన్ని అరికట్టక పోతే పేట్రేగిపోతోంది" అంటూ ఆవిడ హెచ్చరిక చేసింది.

"మన మందలింపులు అతగాడు గౌరవించక వాదానికి దిగితే..."

"వాదించి గెలవండి. అతగాడు పరాశరుడా! వరాహమిహిరుడా! ఏ సిద్ధాంతం ప్రకారం యీ నిర్ణయానికి వచ్చాడో సహేతుకంగా నిరూపించ మనండి."

"వాదన సమయంలో పూలమాలలు ధరించాలా? మాల వాడిపోయేదాకా వాదన కొనసాగించాలా?" అంటూ ఆయన కొంటెగా ప్రశ్నించాడు.

"మీరు మండనమిశ్రులు కారు; అతగాడు శంకరాచార్యులవారూ కాదు.... మాలలతో పనిలేదు."

"నువ్వు మాత్రం ఉభయ భారతివి" అంటూ ఎంతో గౌరవంగా ఆవిడ వంక చూశాడు.

"కాదు 'భామతి'ని" అని అంది.

మరునాడు కన్యాదాతకు ఉత్తరం వెళ్లింది. చి॥సౌ॥ శుద్ధ మానస వివాహ ఆహ్వాన పత్రిక సకాలంలో అందినది. మీ చిరంజీవికి కల్యాణ ఘడియలు వచ్చినందుకు చాలా ముదావహంగా ఉంది. ఈ వివాహానికి అపురూపమైన ముహూర్తం నిర్ణయించిన దైవజ్ఞుల దర్శనం చేసుకోవాలని వారి దగ్గర ముహూర్త నిర్ణయంలో కొన్ని సందేహాలు తీర్చుకోవాలని, కొన్ని మెలుకువలు నేర్చుకోవాలని ఆకాంక్ష. వారి చిరునామా తెలుప ప్రార్థన."

తిరుగు టపాలో సమాధానం వచ్చింది. కన్యాదాత ఏనుగెక్కినంత సంబరపడుతూ ఉత్తరం రాశాడు.

"మీరు ఉభయులు తప్పక ఈ వివాహానికి విచ్చేసి మా అమ్మాయిని అల్లుడిని ఆశీర్వదించాలి. దైవజ్ఞులవారిని పరిచయం చేస్తాను. మీరు వస్తున్నారని విని వారు కూడా చాలా సంతోషించారు. మీ ఆచారానికి, మడికి ఇబ్బంది లేకుండా ప్రత్యేకమైన వసతి ఏర్పాటు చేయించాను.

పిన్నిగారి కోసం, మీ కోసం ఎదురు చూస్తూ ఉంటాం. తప్పక రావలసింది.'

రామచంద్రయ్యగారు ఆ ఉత్తరం జానకమ్మగారికి ఇస్తూ -

'కార్యేషు మంత్రీ కరణేషు దాసి' అంటూంటే ఆవిడ మధ్యలో అడ్డుకుని, అక్కడితో ఆపండి. మనం 'వానప్రస్థులం' అని అంది.

'మన తక్షణ కర్తవ్యం?' అని ఆయన అడిగారు.

"దోష నివారణకు శాంతి ప్రక్రియలు చేయడమే!"

"ఎలా? వాళ్ళ జన్మ నక్షత్రాలు తెలియవు. జాతకాలు తెలియవు."

"వాళ్ళని అడిగి తెలుసుకోండి."

"ఇటువంటి వారికి శాస్త్ర గ్రంథాలలో శాంతి ప్రక్రియలు చెప్పలేదు."

"శాంతి కమలాకరం, నిర్ణయ సింధు, ధర్మసింధు గ్రంథాలు మళ్ళీ ఇంకొకసారి పరిశీలించండి."

"పరిశీలించి?"

"నవగ్రహశాంతి, ఆయుష్య హోమం, మృత్యుంజయ జపం వగైరా చేయించండి" అని ఆవిడ సలహా ఇచ్చింది.

మనస్సు తేలిక అయింది.

ఎక్కడో మారు మూల గ్రామంలో... నదీతీరాన కాలం గడుపుతున్న ఆ ఆది దంపతులు భాగ్యనగరం తరలి వచ్చారు. కన్యాదాత ద్వారా వీరికి రాజ సమాన మర్యాదలు లభించాయి.

మనస్సులో వెయ్యి సంకోచాలు, సందేహాలు బాధిస్తుండగా, ముహూర్తం గురించి కదిపితే - కన్యాదాత, "మా సిద్ధాంతిగారికి ఈ శాస్త్రం బాగా తెలుసు. ఆయన అన్ని ఆలోచించి అందరికీ వీలుగా ఉండాలని ఈ ముహూర్తం నిశ్చయించాను. ఇప్పుడు మార్పులు చేర్పులు, శాంతులు హోమాలు మా వల్లకాదు' ' అంటూ నిర్మొహమాటంగా చెప్పివేశాడు.

ముహూర్తం ఎటువంటిది అయితేనేం? పిలిచినవారంతా- ఆ మహానగరం లోని మహా నాయకులు, కుబేరులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, సంగీత సారస్వత లలిత కళారసజ్ఞులు, మీరు ఏ వర్గం చెప్పండి - దాని తాలూకు అగ్రశ్రేణి వ్యక్తులంతా ఆనాడు అక్కడ హాజరైనారు. ఆ వేడుకలు, ఆ వైభవం చూసి తీరవలసిందే. అటువంటి విందు తమకు జ్ఞాపకం ఉన్నంత వరకు ఇప్పటి వరకు మన రాష్ట్రంలోనే కాదు బహుశః భారతదేశంలో కూడా ఎవ్వరు ఇవ్వలేదేమో నని" ఇటువంటి శుభకార్యాలకు అలవాటుగా వచ్చే అభిజ్ఞాన వర్గాల వారు అభిప్రాయ పడ్డారు. కన్యాదాత లక్షలు దాటి ఖర్చు కోటికి పడగ ఎత్తితే, ఆ వధూరత్నానికి వచ్చిన కానుకలు-బహుమతులు అవి కూడా అన్ని కలిపితే ఆ స్థాయికి వచ్చాయి.

పెండ్లి ఇంత బాగా జరిగినందుకు, జరిపించినందుకు ఆ కన్యాదాతను అందరూ అభినందిస్తే, ఆయన అతివినయంగా "నాదేముంది... అంతా ముహూర్త బలం. అంతా వీరి చలువ" అంటూ ఒక వ్యక్తిని పరిచయం చేశాడు.

నుదుట విభూతి, కనుబొమ్మల మధ్య కాసంత బొట్టు, మెళ్ళో రుద్రాక్షమాట, దుబ్బుజుట్టు, బవిరిగడ్డం, గులాబి రంగు సిల్కు లాల్చి, అదే రంగు పంచె, కళ్ళకు కాటుక, భుజస్కందాల మీద చాలా విలువైన పండిత శాలువ! ఆయనను అందరూ గౌరవిస్తూంటే- ఆయన వీరినందరినీ అర్థనిమీలిత నేత్రాలతో, అభయ ముద్రతో ఆశీర్వదిస్తున్నారు.

వధూవరులను ఆశీర్వదించడానికి వేదిక దగ్గిరకు వస్తున్న ఈ ఆది దంపతులను చూసి ఎవరీ గ్రామీణులు అన్నట్టు కన్యాదాత వంక చూశాడు.

కన్యాదాత ఒక్క క్షణం తటపటాయించి, ఏమనుకున్నారో ఏమో ఆ వ్యక్తిని ఏదో అర్థించారు.

ఆయన చికాకుగా ముఖంపెట్టి తన గౌరవానికి భంగం కలుగుతున్న భంగిమలో వీరి దగ్గరకి వచ్చారు.

కన్యాదాత ఈ దంపతులకు నమస్కారం పెట్టి, ఆ వ్యక్తికి వీరిని సగౌరవంగా పరిచయం చేశాడు. మా కుటుంబం ఈనాడు ఈ స్థితిలో ఉందంటే వీరి ఆశీర్వచనం, అనుగ్రహం వలననే. చిన్ననాడు - నన్ను కన్నబిడ్డల కన్నా ఎక్కువగా ఆదరించారు. మాకు విద్యాగురువులు, ఆధ్యాత్మిక గురువులు.

వేద వేదాంగములు తరచి చూచినవారు, 'ప్రస్థానత్రయం' కూలంకషంగా అధ్యయనం చేసిన వారు, జ్యోతిషశాస్త్రంలో వారికి వారే సాటి. నవద్వీపం, వారణాసి నుంచి కన్యాకుమారి వరకు గల జ్యోతిష సాంప్రదాయాలు తెలిసినవారు, ముహూర్త భాగంలో వారికి వారే సాటి. అఖిల భారత జ్యోతిష మండలికి అధ్యక్షులుగా ఉంటున్నారు.

మా అందరికి అమ్మగారు జానకమ్మగారు. అష్టభాషా ప్రవీణురాలు. జ్యోతిషంలో- హోర విభాగాలలో- మా గురువు గారికి సరైన జోడి.

ఈ దంపతులు ఈనాడు ఇక్కడికి విచ్చేసి- వధూవరులని ఆశీర్వదించడం మా అమ్మాయి చేసుకున్న పూర్వజన్మ సుకృతం. మాటలలో మరచిపోయాను. ఈ వివాహ శుభముహూర్తం గురించి ఆయన ఏదో అడగదలుచుకున్నారు" అని అంటూ తన వెంట వచ్చిన వ్యక్తిని రామచంద్రయ్య గారికి పరిచయం చేస్తూ "వీరు ఈ మహానగరంలోని దైవజ్ఞులకు చక్రవర్తి. ఇక్కడ ముఖ్యమైన శుభకార్యం ఏది జరిగినా దానికి ముహూర్త నిర్ధారణ వీరు చేయవలసిందే. మా అందరికి ఆప్తమిత్రులు- శ్రీ సుదర్శన సిద్ధాంతిగారు" అని అన్నాడు.

ఆయన సినిమా భంగిమలో నమస్కారం పెట్టాడు. ఈ సంఘటన జరుగుతూ ఉండగా ఎవ్వరూ ఫోటోలు, వీడియో తీయకుండా జాగ్రత్త పడ్డాడు.

"మీ దర్శనం వలన నా జన్మ ధన్యమైంది. మీరు ఉభయులు మా గృహం పావనం చెయ్యాలి. ఈ అజ్ఞాని వలన ఏవైనా దోషాలు సంభవిస్తే - మనవి చేస్తే సరిదిద్దుకుంటాను."

అతని ప్రార్థన మేరకు వారిద్దరు మరునాడు ఉదయం అతని ఇంటికి వెళ్ళారు. అక్కడ పూర్ణకుంభం, నాదస్వరంతో వారికి స్వాగతం లభించింది.

అర్ఘ్యపాద్యాలు అయ్యాయి. సవినయంగా వీరి ఎదుట అతను చేతులు కట్టుకుని నిలబడ్డాడు. ఆ ఇల్లు చాలా వైభవోపేతంగా ఉంది. జ్యోతిష్యశాస్త్రం మీద మంచి గ్రంథాలయం, రెండు కంప్యూటర్‌లు, ఫాక్స్‌మెషిన్, టెలిఫోన్లు, జాతక విభాగం, ముహూర్త విభాగం, గ్రహదోష నివారణ- శాంతి విభాగం అంటూ రకరకాల శాఖలు ఉన్నాయి. చాలామంది హడావిడిగా పని చేస్తున్నారు.

రామచంద్రయ్యగారి దృష్టి నిలచింది. చలనచిత్ర విభాగం, రాజకీయ విభాగం, విదేశీవాసుల వివాహ ముహూర్త విభాగం.

"చలనచిత్ర విభాగం అంటే..." అని జానకమ్మ గారు అడిగింది.

"సినిమా ప్రారంభానికి ముహూర్తం- ముఖ్యశాస్త్రం ప్రకారం సినిమా హీరో హీరోయిన్లని ఆ సినిమాలో ఎన్నుకోవాలి. ఏయే దిక్కులలో ఉన్న ప్రాంతాలలో షూటింగ్ జరపాలి, ఎన్ని రోజులలో సినిమా తీయడం పూర్తి కావాలి, మొదటి కాపీ ఏ ఆలయంలో పూజ చేయించాలి, శత దినోత్సవం వేడుకలూ, వేదిక మీద ఎందరు కూర్చోవాలి - స్త్రీలు ఎందరు, పురుషులు ఎందరు, ఆ సభకు ఎటువంటి పేరుగల వారిని అధ్యక్షులుగా పిలవాలి - ఈ విషయాలు ఈ విభాగంలో నిర్ణయిస్తారు.

రాజకీయ విభాగంలో- రాజకీయ నాయకుడికి భవిష్యత్తులో కలుగబోయె శుభ అశుభాలు, శత్రువులు ఎవరో, మిత్రులు ఎవరో? ఏ ముహూర్తంలో పదవీ స్వీకారం చెయ్యాలో, ఎంత కాలం తమ పదవిలో ఉండగలడో... ఎంత ధనం- పలుకుబడి సంపాదించగలడో- ఎవరి వలన నమ్మక ద్రోహం జరగడానికి అవకాశం ఉందో, హవాలా వంటి వ్యవహారాలు ఏవైనా యిబ్బంది కలిగిస్తాయా? దాని నుంచి బయట పడగలడా? సంతానం వలన సుఖ దుఃఖాలు - ఏదైనా ప్రమాద పరిస్థితి ఏర్పడితే ఏ ముహూర్తంలో రాజీనామా ఇవ్వాలో, ఆ రాజీనామా ఉత్తరం టైపు చెయ్యాలా, చేత్తో రాయాలా, ఎటువంటి కలం, ఏ రంగు సిరా వాడాలో చెబుతాం. తిరిగి పదవి సంపాదించుకునే లోపల ఏ విధంగా ఎంత కాలం ప్రవర్తించాలో చెబుతాం."

"విదేశీవాసుల వివాహ ముహూర్తం అంటే?" అని రామచంద్రయ్యగారు ప్రశ్నించారు.

"మనవి చేస్తున్నాను... చాలా మంది మన దేశవాసులు- ఈనాడు సముద్రాలు దాటి విదేశాలకు ఉద్యోగ నిమిత్తం కాని, విద్యార్జన కోసం గాని వెడుతున్నారు. అక్కడి ఆడపిల్లలు, ఇక్కడి మగ పిల్లల్ని, ఇక్కడి మగపిల్లలు అక్కడి ఆడపిల్లల్ని చేసుకోవడం గత పది సంవత్సరాలుగా ఎక్కువ అయింది. వాళ్లు కొన్ని మాసాలలో మాత్రమే ఇక్కడికి రావడం జరుగుతోంది. ఆషాఢం, భాద్రపదం, పుష్యం - ఈ మాసాలలో ఇక్కడికి రావడం, చాలా తక్కువ వ్యవధిలో వివాహం చేసుకుని వెంటనే వధూవరులు వివాహాన్ని రిజిష్టరు చేయించుకొని ఆ దేశాలకు తిరిగి వెళ్లడం - ఇది సర్వ సాధారణంగా జరుగుతున్న విషయం."

"అంటే?" అంటూ జానకమ్మ గారేదో అడగబోయింది.

"మీరు అడగబోయే ప్రశ్న నాకు తెలుసు. వారికి అనుకూలంగా నడుచుకోవడం, వారు ఇండియాలో ఉండగా వివాహం జరిపి పంపించడం మనం చేయవలసిన తక్షణ కర్తవ్యం.

"నిషిద్ధ సమయాలు, ఏక వింశతి దోషాలు, పంచక రహితం.." అంటూ రామచంద్రయ్యగారు ఏదో అడగబోయారు.

"గురువుగారూ! మీ ఉభయులకూ తెలియనిది ఏముంది - ధర్మం నాలుగు పాదాల నడచిన రోజున - అవన్నీ జరిగాయి. ఈనాడు - వాళ్లకు అనువైన ముహూర్తం పెట్టడం - మనకు కావలిసిన దక్షిణ వసూలు చేసుకోవడం. ఈ రోజుల్లో పెళ్ళి ముహూర్తం ఒక లాంఛనం మాత్రమే."

ఆ ఆదిదంపతులు లేచి నిలబడ్డారు.

ఇహ ఆపవలసింది అన్నట్టు కన్నులతోనే హెచ్చరించారు. "శూన్యమాసం- అందులో అధిక మాసం - అమావాస్య తిథి - సోమవారం - గ్రహణం- రాహుకాలం వర్జ్యం- ఉన్న సమయంలో వివాహ ముహూర్తం నిర్ణయించడమే కాకుండా ఆ ముహూర్తంలో వివాహం జరిపించిన వాడిని భగవంతుడు ఏ విధంగా దండిస్తాడో- ఏ నరకానికి పంపుతాడో ఒకసారి క్షుణ్ణంగా తెలుసుకో. తెలిసి కావాలని చేస్తున్న ఈ ఘోరపాపానికి నీ సంతానాన్ని బలి చేయవద్దు. శరీర పోషణకి ధనం అవసరమే కాని, ధర్మ విరుద్ధమైన అర్జన తరతరాల వారిని నాశనం చేస్తుంది.

క్షణికమైన లాభంకోసం - శాశ్వతమైన ధర్మాన్ని పోగొట్టుకోవద్దు!

దైవదత్తమైన యీ శాస్త్రాన్ని అపహాస్యం పాలు చేయవద్దు."

సుదర్శన సిద్ధాంతిగారు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నిలబడ్డారు. రామచంద్రయ్యగారు విడిదికి తిరిగి వచ్చి - సచేల స్నానం చేసి- యజ్ఞోపవీతం మార్చుకుని - సహస్ర గాయత్రీ చేసుకుని స్వగ్రామానికి తరలి పోయారు.

రామచంద్రయ్యగారు జానకమ్మగారు- తన భవనం వదిలి వెళ్ళగానే సిద్ధాంతిగారు హేళనగా పెద్దపెట్టున నవ్వి- అప్పుడే కెనడా నుండి వచ్చిన కేబులుకు సమాధానంగా -

"భాద్రపద బహుళ ద్వాదశీ శుక్రవారం మధ్యాహ్నం 11 గంటల 55 ని॥లకు- మీ కుమార్తె చి॥సౌ॥ లక్ష్మీప్రియ వివాహమునకు - ముహూర్తం లగ్నం దివ్యంగా ఉన్నది. ఈ శుభకార్యం కోసం - మన కల్యాణ మండపం మీకోసం రిజర్వు చేయిస్తున్నాను. అడ్వాన్సుగా రెండువేల అమెరికన్ డాలర్లు పంపవలసింది."

అంటూ ఒక ప్రవాస భారదీయుడికి ఉత్తరం రాయడం మొదలు పెట్టాడు.